# మూడు .... ఉత్తరాలు

రచయిత:

"జ్ఞాన శ్రీ"

[ఒక నికృష్టజీవి భార్యాకు, తల్లికి, తండ్రికి వ్రాసిన లేఖలు యీ మూడునూ్నా. స్వార్థసంఘం మానవజీవితాలను ఏవిధంగా నలిపి నాశనం చేస్తుందో, వారి జీవితాలు ఏవిధంగా అంతమౌతాయో తెలియజేస్తుందీ రచన—]

నిర్మలాకాశం మేఘావృతమైంది... మెరుపులకాంతి కష్టజీవుల ఆశాజ్యోతుల్లా అప్పుడప్పుడు మెరుస్తున్నాయి ...చిన్న చినుకులు పడుతున్నాయి...

ఆశానిరాశల మధ్య సమరకేళి సాగిస్తూ జీవితాన్ని చావుబ్రతుకుల మధ్య త్రోసి ఆక్రోశించు నిరాధారులను తలచుకుంటూ ముందుకు సాగిపోతున్నాను...

ప్రపంచాన్ని కంపింపజేసే ఉరుములు... మెరుపులు... పాంధులను భయపెడుతున్నా లెక్క చెయ్యకుండా ముందుకు పోతున్నాను...

దూరంగా చలికి... నీటి జల్లుకు... భరింపలేని కుక్కలు మోలలెత్తి అరుస్తున్నాయి...

నేను నడుస్తూనే వున్నాను...

నాకళ్లు రోడ్డుమీద చెల్లాచెదరుగా పడివున్న మూడు కవర్లమీద పడ్డాయి...తీసి చేత్తోపట్టుకుని చూసేను... వాటివేటి మీదా చిరునామాగాని మరేమిగాని వ్రాసియుండలేదు... నీటి జల్లుకు తడిసి దీనత్వాన్ని ప్రదర్శిస్తున్న ఆ మూడు కవర్లనుతీసి జేబులో పెట్టుకుని గబగబా ఇల్లు చేరుకుని గదిలోకిపోయి దీపం పెద్దదిచేసి ఒక కవరు విప్పేను...అందులో ఓ ఉత్తరం... ఈలావుంది...

"నళినీ...

నీకు యిదే ఆఖరు ఉత్తరంగా వ్రాస్తున్నా... జీవితమనే సుడి గుండంలో కామ మనే మహారాక్షసిని ప్రేల్చి ప్రేమకు ప్రాధాన్యమిస్తూ ఆదరిస్తావనే ఉద్దేశంతోనే తక్కువజాతిదానివైనా వివాహం చేసుకున్నాను...

అయితేనేం, కుటిల స్వభావంతో "ప్రక్క యొక్కని సంపర్కం ప్రేమ సంపర్కమే కాదు" అంటూ నీ అవివేకానికి చింతిస్తున్నా...

నువ్వు అన్నట్టు నేను నిర్ధనుణ్నే... కాని హృదయమనేది వుందనిమాత్రం గ్రహించు... బ్రతుకు తెరువులోని సిగ్గు లజ్జలకు శ్రీరామరక్ష పెట్టి లోకానికి భయపడకుండా నడిరోడ్డుమీద సైతం ఖాతరు లేకుండా కామకలాపం సాగిస్తే జంతువుకూ మనకూ అట్టే తారతమ్యం కనిపించదు...

జీవితానికి...

జీవితానికి... ధనమూ... కామమూ... ప్రధాన మని తలచిన నీ వెర్రితలంపు యికనైనా విడచిపెట్టి తుదిజీవితాన్ని ఆనందంగా సాగించు...

స్వార్థమనే పిశాచానికి చిక్కి యవ్వనాన్ని శారీరక సౌఖ్యాలకు బలిచేసి నశించిపోకు... నువ్వు యెక్కడున్నా... ఎవరితో ఏలావున్నా... నీ ఆనందమే నా ఆనందము... అని భావించు...

ప్రస్తుతమూ నేనొక పేద బికారినై... ఆకటికి మాడుతూ... యాచనా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నా... ఈ స్థితే నాకు మహానందాన్ని కలిగిస్తున్నాది... ఎంచేతంటావేమో... జీవిత పాయలలోని ఒడిదొడుకులను బాగా అర్థం చేసుకుని జీర్ణింపజేసుకోజాలని వాతావరణం ఇక్కడవుంది... దరిద్రములోని ఆనందాన్ని అనుభవిస్తూ శారీరక సౌఖ్యాలకు దూరమై అద్భుత జీవి

తాన్ని సాగిస్తున్న నా గొడవ నీకు ఆగ్రహం కలిగించ వచ్చు...అయినా నువ్వు నన్నేం చెయ్యలేవు...అంతే...

ఇట్లు
నీ..."

♦ ♦ ♦

తృష్ణా జీవితాన్ని యేవగించుకొని...కోరి దరిద్రాన్ని వరించి...బికారులలో బికారిగా మారిన ఆ ధన్యజీవి ఆదర్శ లేఖకు నాహృదయం యుప్పొంగి పోయింది...

సాంఘిక వ్యవస్థలో యువకుల...యువతుల తాత్కాలిక సౌఖ్య ప్రేమ యధాతథంగా చిత్రించిన ఆ లేఖకునికి ధన్యవాదాలర్పిస్తూ రెండవ లేఖ తీసేను... అది తల్లికి వ్రాయబడివుంది...

"అమ్మా...

నేను గృహపరిత్యాగంచేసి నీ హృదయాన్ని కలత పెట్టేను...మాతృశ్రీని కన్నీటినుండి వెడలిన అశ్రుబిందువులు కుమారుని రక్షణకు ఆటంక కారణముగా వుంటుందన్న సంగతి నాకు తెలుసు...

కాని యేంచెయ్యను...ప్రేమ శిఖరాన్ని అందుకుందామని ప్రయత్నించి కామపిశాచి చేతులలో పడి పోయేను...ఈలా జరుగుతాడని ప్రథమంలోనేగాని తెలిసి వుంటే యీలా చేసేవాణ్ని గాదు...ముఖ్యంగా యీనాడు మానసిక తత్వాన్ని అర్థం చేసుకోక ప్రయత్నాలు కొనసాగించినవాడు మానసికవ్యథలకు గురవుతాడని తెలుసుకున్నాను...

నమ్మించి ప్రేమించేనని లాలించి వలలో వేసుకున్న నళిని నన్ను విడిచిపోయింది...ధనం వెచ్చించి ఆర్జించిన విద్య ధనహీనుణ్నిగా మార్చింది...ప్రస్తుతం నేనొక బికారిని...

దరిద్రుని ధనవంతుడు తిరస్కరించటం చట్టం న్యాయం అయినా దరిద్రుణ్ని దరిద్రుడు తిరస్కరించే అన్యాయం జరుగుతుందీ లోకంలో...దేనిసంఘమో... ప్రజలో బాధ్యులైవుండాలి...ఎవరు బాధ్యులో మాత్రం తెలియకుండావుంది...

ఈ రూపంతోనైనా సరే యింటికి రమ్మని నీహృదయం కోరుతుందికాని సంఘంమాత్రం నన్ను రానీదు...ఎం చేతో తెలుసా నేను దరిద్రుణ్ని అవటంచేతనే...అదిగాక నాకు దరిద్రంలోనే సుఖంవుంది...నాబదులుగా తమ్ముణ్ని చూసుకుని జ్ఞానిగా మార్చి సుఖపెట్టు...ఇదే నా అంత్యలేఖగా భావించు...శలవు.

అట్లు,
నీ..."

♦ ♦ ♦

హృదయావేదనతో అలమటిస్తూ కూడా న్యాయదృష్టిని విడనాడక దారిద్ర్యమును అనుభవిస్తూ పస్తులు మాడుతూ కూడా దారిద్ర్యములోనే సుఖమున్నదని ప్రపంచానికి చాటిన ఆ వ్యక్తి నవ్యసిద్ధాంతమునకు నమస్కృతులర్పిస్తూ మూడో ఉత్తరం తీసేను...అందులో యీలావుంది...

"ప్రియమైన తండ్రిగారికి...

సంఘమనే యినుప చక్రాలక్రిందపడి నలిగిపోతున్న మీ కుమారుడు వ్రాస్తున్న యీ లేఖ మీకు ఆగ్రహాన్ని కలిగింపవచ్చును...కాని నా అంత్య సందేశంగా అందించిన యీ లేఖ నావ్యథను బాపుతుందనే ఉద్దేశంతోనే యిది మీకు వ్రాస్తున్నా...

ఏ స్త్రీ కోసం...సంఘాన్ని ... బందుగులనూ... గ్రామాన్ని విడిచి వెళ్లిపోయేనో ఆస్త్రీ నన్ను విడిచి వెళ్లి పోయింది...నాప్రేమ హృదయం భగ్నమైపోయింది... ఇప్పుడు నేను శిథిలహృదయంతో బికారినై వీధులంట తిరుగుతున్నాను...

నన్ను యిప్పుడు సంఘంగాని...సంఘంలోని వ్యక్తులుగాని మీరుగాని ఖాతరు చెయ్యరు...ఒక వేళ కన్నకడుపు కొద్ది మీరు ఆదరించినా సంఘం మాత్రం వొప్పుకోదు...

అందుకే మీకుగాని...యీ సంఘానికిగాని...కనిపించనంత దూరంగా పోతున్నా...ఈ అనామకుణ్ని మాత్రం మరిచి పోకండి...శలవు...

ఇట్లు
నీ..."

ఉత్తరం మడిచి ఆనిర్భాగ్యుని జీవిత చరిత్ర తలచుకుంటూ పడకకుర్చీలో నడుంవాల్చేను...

దీపం జేగంటలా వెలుగుతున్నాది...వర్షం యింకా కురుస్తూనేవుంది...దూరాన్ని చలిబాధతో అరుస్తూన్న కుక్కలరోద చిన్నమూలుగులా వినిపిస్తున్నాది...

అంతే...